# పిచ్చితల్లి

('లాయర్' దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి
పొందిన కథ 19-10-84)

బిడ్డ మనస్సు రాయి అని తెల్సినా తల్లి మనస్సు వెన్న.
అలాటి తల్లిని నిర్లక్ష్యం చేయమన్నదా మన సంస్కృతి.

—జయప్రద

నెల్లూరు నగరంలో ఒక చిన్న ప్రయివేటు హాస్పిటల్లో—జనరల్ వార్డులో- ఏడో నంబరు పడకమీద పడుకున్న అరవై యేళ్ళ వృద్ధురాలు ప్రక్క బెడ్ వైపు తదేకంగా చూస్తోంది.

ఆ ప్రక్క బెడ్‌మీద ఇరవై ఏళ్ళ యువతి అప్పుడే తల్లి స్థానం ఆక్రమించుకొని తన గర్భంలోనుంచి తొలిసారి బయటపడ్డ బిడ్డవైపు ప్రేమగా, పులకింతగా చూస్తున్నది. బొడ్డూడని ఆ బిడ్డ ఆ తల్లిగుండెల్లో అద్దంలా ఎంత భవిష్యత్తును చూపిస్తున్నాడో!

ఆమె బీటలువారిన పెదవులమీద ఎండిపోయిన హాస్యరేఖ. ఆమెకా క్షణంలో గుంటూరులో ఇలాటి చిన్న హాస్పిటల్‌లోనే తన పుట్టింటివాళ్ళ ఖర్చులతో తను తల్లి అయిన దినం గుర్తుకు వచ్చింది. ఆనాడు తన గుండెల్లో ఎగిసిపడిన గర్వం తాలూకు ఆనందం గుర్తు వచ్చింది.

ఆ పచ్చటి జ్ఞాపకం ఇంకా ఎక్కడ దాగుందో!

క్షణకాలం ఆమె మనసును పులకరింప చేసింది. వెంటనే ఆమె స్పృహ తెచ్చుకుంది. తల విదిలించుకుంది. ఆనాటి జ్ఞాపకాలనూ విదిలించుకుంది.

ఆ ప్రక్క బెడ్ దగ్గరకు ఆమె భర్త కాబోలు వచ్చాడు చేతిలో చిన్న ప్యాకెట్టుతో....

ఏమిటన్నట్టు చూసిందా అమ్మాయి.

ఆ అమ్మాయి చూపుల్లో, కదలికల్లో, కళ్ళల్లో అంతా ఆనందమే. ప్రపంచంలో తాను సాధించాల్సింది సాధించానన్న గొప్ప గర్వం ప్రతి స్త్రీ తల్లి అయిన మరుక్షణంలో అనుభవించే భావస్పందన. అతను ప్యాకెట్‌ను విప్పాడు. అందులోనుంచి చిన్న రోజారంగు స్వెట్టర్ తీసాడు. దాన్ని భార్యకు చూపి నవ్వాడు. ఆ నవ్వు—ఆ నవ్వు మునలామె బలవంతంగా జార్చుకున్న జ్ఞాపకాల తెరల్ని తొలగించింది.

ఆరోజు....ఇలాగే ఇంకో పదిరోజులు ఆలస్యంగా, తను పురిటి స్నానం చేసిన రోజు.

తన భర్త....ఇప్పుడెక్కడున్నాడో- అప్పుడే తనను ఏకాకిచేసి వెళ్ళి పాతిక సంవత్సరాలయిపోయింది....

ఆమె ఎండిపోయిన కళ్ళల్లో సన్నటి తడి, ఇంకా ఎండిపోని తడి, ఆమెకే ఆశ్చర్యమేసినట్లు వుంది.

సిగ్గుపడ్డట్టుగా మరొకరికి తెలీకూడదన్నట్టుగా ప్రక్కకు తిరిగి తన తెల్లటి చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంది. తుడుచుకొని కొంగు వైపు చూసుకొంది. అది తెల్లగానే వుంది. తెల్లగా వుండక ఎలా వుంటుంది? ఆ రోజులా? భర్త కొడితే జారిన కన్నీటిని తుడుచుకుంటే కొంగుకు కాటుక అంటుకోడానికి!

ఆయన తనను కొట్టేవాడు, తిట్టేవాడు, అయినా ఆయన గతించి పోయిన ఇన్నేళ్ళకు ఆయన గురించి ఇంకా తన కళ్ళల్లో తడి–

ఏమి చిత్రం- ఏమి చిత్రం....!

ఆమె మరలా వూరిన కన్నీటిని తుడుచుకుంది.

ఆయనకొడితే ఏం, తిడితే ఏం? ఆయన తనని అభిమానించిన బరువుచాలదూ ఆయన్ని జీవితాంతం గుర్తుపెట్టుకోవడానికి!

'సారీ ఉదయా' అని తనని అక్కున చేర్చుకున్న క్షణంలో తనకు ఆయన కొట్టిన దెబ్బ అసలు గుర్తుకొచ్చేదా!-

అసలీనాడు ఆయన బ్రతికుంటే తనను ఒంటరిదాన్ని చేసేవాడా? ఛీ ఛీ ఏమిటీ బలహీనత? ఈసారి కళ్ళు మరీ గట్టిగా తుడుచుకుందామె. తుడుచుకుని ప్రక్కకు చూసింది-

ఒక్కరోజన్నా గడవని కొడుక్కి స్వెట్టర్‌వేసి తలకు టోపీ కాళ్ళకు అదేరంగు మేజోళ్ళువేసి భార్యవైపు గర్వంగా చూస్తున్నాడతను.

ఆరోజు....ఆరోజు తన పురిటిరోజు ఆయన ఇలాగే ఇంత అంద మైనది కాకపోయినా మోటు స్వెట్టర్ ఒకటితెచ్చి తన కూతురుకు తొడు గుతూ ఇలాగే గర్వంగా తనవైపు చూసాడు.

ఆ బులుగు రంగు స్వెట్టర్‌తో తెల్లటి సంధ్య తనని తొలిసారి మాతృమూర్తిని చేసిన సంధ్య ఎంతందంగా వుండినదని!

ఆమె అణువణువునా క్షణకాలం తొలకరి జల్లులాటి ఆనందం-

మరుక్షణంలో దాన్ని చంపేస్తూ అనుభవంనేర్పిన సత్యం ఆమెను చిక్కటి దుఃఖం తాలూకు చివరిమెట్టు పైకి తోసేసింది. సంధ్య తన సంధ్య అది పుట్టిననాటినుండి ఆయనేం కట్టాడో తనకేం కొనిచ్చాడో చాలీచాలని జీతంతో కానీ ఆ పిల్లను బొమ్మలా చూచుకోవాలనే ఉబలాటంలో రెడీమేడ్ చొక్కాలే వేసాడు. కానీ సంధ్య బంగారం బొమ్మలాంటి సంధ్య ఏం చేసింది?

తండ్రి చనిపోయినా తను తన డొక్కలో పెట్టుకుని చాకిన సంధ్య ఏమి చేసింది?

ఆమె నచ్చినవాడిని తను కాదన్నదని చెప్పాపెట్టకుండా అర్ధరాత్రి అతనితో మాయమైపోయింది. అలా వెళ్ళిపోయి పదిహేను సంవత్సరాలు అయినా ఈ పేదతల్లిని చూడాలని ఆ పిల్లకు అనిపించనేలేదు కాబోలు! ఒక్క ఉత్తరము మాత్రం వ్రాసింది- నీవు ఆయన్ను వెనకా ముందూ ఆలోచించకుండా తూలనాడావు గనుక ఆయన నన్ను నీ దగ్గరికి పంపరట. నన్ను మర్చిపో-క్షేమంగా వుందనే వార్త వింటే చాలనే దశకు తనను తోసేసింది ఉరకలు వేసే పరువం జారిపోయినాకయినా యీ తల్లి మనసును అర్థం చేసుకోలేక పోయారువాళ్ళు. ....ఏం బిడ్డలు? ఎందుకా బిడ్డల కొరకు ఇంత తాపత్రయం!

ఆరో నెంబరు బెడ్‌మీద ఈ ఉదయం పిల్లలకొరకు ఆపరేషన్‌ను చేయించుకున్న ముప్పది సంవత్సరాల పడతితో అనాలనుకొంది....

'ఎందుకు తల్లీ బిడ్డలు! బిడ్డలు లేకపోతే ఒకే దిగులు-వుండి వారిచేత చిత్తుగా మోసగింపబడితే ఆ తల్లి గుండెలు పగిలిపోతాయి తల్లీ! ఆ అనుభవం నీ కొద్దు. హాయిగా నీ జీవితాన్ని నువ్వు నిర్మించుకో. బ్రతికున్నంతకాలం నువ్వు మీ ఆయన ఒకరికొకరు బిడ్డలనుకోండి' అని చెప్పాలనుకుంది.

కానీ ఆరుసార్లు నోరు తెరచి మరలా తనను తాను సంభాళించుకొంది—ఆనాడు అమ్మ చెప్పిన మాటలు తనేమాత్రం వింది కనక!

ఆమె ఎంతో అనుభవంతో చెప్పింది "వద్దు ఉదయా మేము కని బాధ పడుతున్నాం. ఇద్దరు పిల్లలు చాలు, ఆపరేషన్ చేయించుకో మీ ఆయన్ని ఒప్పించుకో" అని–ఆమె అనుభవం తనకానాడు పిచ్చిగా అనిపించింది. కామెర్ల కళ్ళతో చూస్తోంది అమ్మ అనుకొంది. నీ బిడ్డలు నిన్ను లెక్క చేయలేదుకానీ నా బిడ్డల్ని నామాట జవదాటని బంగారు కొండలుగా పెంచుతానని ఆమెతో సవాలు చేసింది....ఆరోజు అమ్మ నవ్విన నవ్వుకర్థం చాలా ఏళ్ళకుగానీ అర్థం కాలేదు.

ఈ రోజు అరవైఏళ్ళ అనుభవాల సోపానాలెక్కి తను యివ్వాలనే సలహా ఇంకా ఒక్కమెట్టన్నా ఎక్కని ఆరో నెంబరు పడక పేషెంటు వినదని ఆమెకు తెలుసు. అందుకే ఆమె పెదాలు విడివడలేదు. ఆమె ఇవ్వాలనుకున్న సలహా ఆమె నల్లటి పెదాల వెనక ఎర్రటి నాలుక చివర లాలాజలంలో ఇంకిపోయింది.

ఆమెకు నీరసంగా అన్పించింది. విపరీతమైన రక్తపుపోటు, మధుమేహంతో ఆ హాస్పటల్లో చేరిన పది రోజులనుండి ఆమె మానసికంగా మరీ నీరసించి పోయింది. గోడ గడియారం ఐదు గంటలు కొట్టింది. చలికాలం అవడంతో, రెండు రోజులనుండి ధారాపాతంగా వర్షం కురవడంతో అప్పుడే వార్డులో చీకట్లు క్రమ్ముకొంటున్నాయి. ఎనిమిది పడకలున్న ఆ జనరల్ వార్డులో రెండు పడకలు ఖాళీగా వున్నాయి. మిగతా ఐదు పడకల చుట్టూ వాళ్ళ బంధుజనం-తన గుండెలలో వేదనను రేపుతూ—

'డాక్టర్లు అదే అంటారు నీవు దిగులు పెట్టుకోకవ్వా' అని తను కావాలని దిగులు పెట్టుకుంటోందా? రోజు సాయంత్రం వార్డునిండా జనాన్ని చూసినప్పుడు తన రెండోకూతురు ఛాయ రాసిన ఉత్తరం గుర్తొస్తుంది.

'మమ్మీ! ఏదో రకంగా అక్కడ అడ్జెస్టు అయిపో! ఏ వార్డుబాయ్ చేతిలోనో రెండ్రూపాయలు పెడితే నీకు అన్నం అదీ హోటల్నుండి తెచ్చిస్తాడు.

"నాకు నీతో హాస్పిటల్‌లో వుండాలనే వుందమ్మా! కానీ చిన్నది బొత్తిగా ఆహారం తినడంలేదు. ఆకలి లేదో యేమో! దగ్గరుండి తిని పించకపోతే తినడంలేదు"

ఆటల్లోపడి ఆకలి మర్చిపోయిన తన చిన్నకూతురు గురించే ఆలోచించిందేగానీ మనసు దెబ్బతిని ఆకలి చచ్చిపోయిన తన తల్లి దగ్గర కూర్చుని ఒక్కపూట, ఒకే ఒక్కపూట భోజనం పెట్టలేని తన మనస్సును ఎంత నిర్థయగా బయటపెట్టింది ఛాయ!

"వార్డ్‌బాయ్ చేతిలో ఒక్క రూపాయి పెడితే హోటల్‌నుండి క్యారియర్ తెచ్చిస్తాడు"

పదిసార్లుగా చదువుకున్న ఆ ఉత్తరంలో ఆ మాటలు ఆమెకు కంఠతా వచ్చేసాయి.

నిజమే డబ్బు కాశపడి వార్డ్‌బాయ్ తెచ్చిస్తాడు. తను కాస్త ప్రేమ చూపితే ఆతను తనమీద జాలి చూపిస్తాడు కానీ తనకు ప్రేమగా అన్నం పెట్టే మనిషి కావాలి, హోటల్‌వాళ్ళు పెట్టే పదిరకాల కూరలు అవసరంలేదు.

ఛాయ పరీక్షలలో ఆయనకు ఒంట్లో బాగోలేదని తెలిసీ ఆయ నను చూడాలని మనస్సు కొట్టుకులాడినా, పరీక్షల్లో హోటల్ అన్నం తిని ఎక్కడ ఆరోగ్యం పాడుచేసుకుని పరీక్షలు వ్రాయలేకపోతుందోనని దూరాన అదే హోటల్ తిండి తింటున్న ఆయన దగ్గరకు వెళ్ళలేక పోయింది.

'నిన్ను డాక్టర్లు ఉప్పు తినొద్దన్నారంట. హోటల్ కూరల్లో ఉప్పు అంతగా వుండదులే...'

ఈ నాలుగు మాటలు ఆ పిల్ల తనకు వ్రాయకపోతే ఎంత బాగుండేది.

హోటల్ కూరల్లో ఉప్పు వుండదా? వుండదు కాబోలు మనస్సు మొద్దుబారిపోయిన తన నాలుక్కి రుచి తెలిస్తే కదా!

కానీ తను ఆరేళ్ళ ఛాయకు గోరుముద్దలు తినిపించే ఆ రోజుల్లో చారులో నెయ్యి సరిపోయిందో లేదోనని అన్నం మెత్తగా ఉడికిందో లేదోనని నాలుకమీద వేసుకుని చూసి మరీ తినిపించిన రోజులు ఆ పిల్ల మర్చిపోయిందా? ఛాయలాగే అందరు పిల్లలు మర్చిపోతారా?

కానీ పక్షవాతంవచ్చి మంచంలోపడ్డ తల్లిని తనిలా నిర్లక్ష్యం చేసిందా? రోజులు మారిపోతున్నాయా? మానవత్వపు విలువలు తరిగి పోతున్నాయా?

ఛాయ మొదటిసారిగా తల్లి అయినప్పుడు ఒళ్ళంతా వాపులు డాక్టర్లు ఉప్పు తగ్గించి పెట్టమన్నారు. ఆ రోజుల్లో కూరలో ఉప్పు వేయడానికి తనచేతులెలా వణికేవనీ! ఈ దయలేని ఉత్తరంలో ఆ నాలుగు ముక్కలు వ్రాసేటప్పుడు ఛాయ చేతులు వణికాయోలేదో కానీ.

వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దానికి తృళ్ళిపడిందామె. తన ప్రక్క బెడ్‌మీద తెరలు తెరలుగా ఏడుస్తోంది. నలుగురి ఆడపిల్లల తర్వాత ఐదో ఆడపిల్లను కన్నతల్లి.

స్వీయ సానుభూతిని నెమరువేసుకోవడం మర్చిపోయి ఆ ఎనిమిదో నంబర్ బెడ్ పేషంటుమీద జాలిపడింది ఉదయలక్ష్మి.

ఇరవయ్యో శతాబ్దం ఆఖరి మెట్టుమీద ఎక్కి కూడా యింకా ఎదగని ఈ సమాజంలో ఐదుగురు ఆడపిల్లలకి ఎలా పెళ్ళిచేస్తుందామె? ఆ పెళ్ళయ్యేదాకా తన కొంగుచాటున ఎలా దాచుకోవాలి వాళ్ళనామె?

స్ట్రెచర్ తాలూకు చక్రాల చప్పుడికి ఇటు తిరిగింది. ఖాళీగా వున్న తన ప్రక్కనున్న ఆరో నెంబర్ బెడ్‌మీదికి ఒక పేషెంట్ చేర్చబడిందన్నమాట. ఆమె వెంట వచ్చిన నర్స్ ఉయ్యాలలో ఒక బిడ్డను తల్లి ఒడిలో ఒక బిడ్డను పడుకోబెట్టి వెళ్ళింది.

పాపం! కవలపిల్లలు ఇది ఎన్నో కాన్పో! ఈసారి ఆరవ నంబర్ బెడ్ పేషెంట్‌ని చూసి జాలిపడ్డంలో మునిగి పోయిందామె.

ఒక రకంగా మానసిక వ్యాధిగ్రస్థులకు ఈ జనరల్ వార్డ్సు మెంటల్ హెల్త్ సెంటర్స్ లాటివి. ప్రక్కవాళ్ళ బాధలతో పోల్చుకుని తాము సంతృప్తి పడిపోవచ్చు.

ఎదురుబెడ్ పేషెంటు తల్లి ఈ క్రొత్త పేషెంటుని పలకరించ డాని కొచ్చింది.

"ఇక కాన్పులు వద్దనుకుంటుంటే మా భాగ్యానికి కవలపిల్లలు" నిట్టూర్చి అంది కవలపిల్లల అమ్మమ్మ.

అంతవరకు మీరదృష్టవంతులు.

లేమ్మా! పుట్టిన నలుసు లిద్దరూ ఆడపిల్లలయ్యారుకాదు తలమీద బరువు. అని ఓదార్చింది మూడో నెంబరు పేషెంటు.

లోతుకు పోయిన కళ్ళతో ఏడో నెంబరు పడకమీద కూర్చొని రెండువైపులకు చూసి నవ్వుకుంది. ఉదయలక్ష్మి ఆ కవల మగపిల్లల కంటే వద్దనుకున్న ఈ ఐదవ ఆడపిల్ల ఆ తల్లిని బాగా చూచుకొంటుంది. కనీసం మొగుడికి తెలియకుండానైనా నాలుగు రూపాయలు నిరాధారు రాలైన ఆ తల్లికిస్తుంది. కానీ ఆ సత్యం ఇప్పుడా తల్లుల కెలాచెప్పడం.

"పిచ్చి తల్లులారా! అమ్మనుకాదని, ప్రమాదాన్ని యెదిరించి రెండోసారి ఆపరేషన్‌కు కూడా సిద్ధపడి పొట్ట కోయించుకొని గవర్న మెంటు ఆసుపత్రిలో మరో ప్రాణిని ఈ భూమ్మీద పడేసి ఆ పడినవాడు తన కోరిక ప్రకారం కొడుకే అయినందుకు సంబరపడి, యీనాడు వాడిచేత విసిరివేయబడ్డ మరో పిచ్చితల్లి మీ ఎదురుగానే వుంది. 'చూడండర్రా కళ్ళు తెరవండర్రా' అని అరవాలనుందామెకు.

ఆ రోజు ఆయనకు విశాఖపట్నంకు ట్రాన్స్‌ఫర్ వచ్చినప్పుడు తనను ఎంతలా ఒప్పించాలని ప్రయత్నించారు.

"వాడి చదువు ఏమీ పాడవదులే ఉదయా! ఈ సంవత్సరానికి వాడిని మీ అమ్మ దగ్గర వదిలేసి వచ్చేయ్. నిన్ను వదిలిపెట్టి ఒంటరిగా

నేనుండలేను. పరీక్షలు అయ్యాక వైజాగ్‌లోనే స్కూల్లో చేర్పి స్తుందాము" అని- కానీ తనేమంది?

"మన సుఖం మనం చూచుకుంటే ఎలా? మగబిడ్డ చదువు పాడయితే ఆ తర్వాత వాడి భవిష్యత్తేమిటి" అంది.

ఆయన్నే సర్దుకోమంది పాపం ఆయన సర్దుకున్నారు.

తన అందమయిన జీవితంలో ఒక్క సంవత్సర కాలం వృధా అయింది.

ఆ కాలం మరలా రమ్మంటే వస్తుందా? ఈ రోజు మూడు పదుల సంవత్సరాలు వెనక్కి వెళ్ళితే తన భర్త ఆహ్వానాన్ని తిరస్కరిస్తుందా? తన భర్తను వదిలి క్షణమైనా వుంటుందా! ఎంత పిచ్చిది తను. అమ్మ హాస్పిటల్ చేరి పది రోజులయితే చూడాలని అన్పించని కొడుకు కొరకు "నిన్ను చూడకుండా వుండలేను ఉదయా!" అన్న భర్తను ఎంత నిర్దయగా కాదంది. కాదని ఎంత పోగొట్టుకుంది.

"రౌండ్స్ కొచ్చినపుడు మీరు పడకమీద లేరు. బి. పి చూడాలని డాక్టర్‌గారు ఓ పి కి రమ్మంటున్నారు మిమ్మల్ని."

బొమ్మలా లేచి నర్స్‌వెంట నడిచిందామె. ఎందుకీ బి.పి.లు చూపించుకోవడం రక్తపోటు ఎక్కువయితే ఏమిప్పుడు? చనిపోతే తన కొరకు బాధపడే వాళ్ళిద్దరూ గతించిపోయి చాలా కాలమైంది. కానీ చని పోకుండా ఏ పక్షవాతమో వస్తే....పాపం ఛాయ! ఎక్కడ చాకిరి చేయగలదు?

* * * *

"మీరు ఆలోచించకూడదు- బి పి ఎక్కువగా వుంది" రోజూ చెప్పేమాటే.

లేచింది. అడుగులో అడుగేసుకుంటూ నడుస్తోంది. బిపి తక్కు

వయిందంటే తనకేమన్నా సంతోషమా! పిచ్చి డాక్టరమ్మ ఎవరయినా వచ్చి 'అవ్వా! నిన్ను చూడను నీ కూతురు, నీ కొడుకు వచ్చారని చెబితే వచ్చే సంతోషం కొన్ని లక్షల డబ్బు లాటరీలో వచ్చినా వస్తుందా తనకు!

"పిల్లాడికి టానిక్కు రాసీ డాక్టరమ్మా!"

"అవసరమైన మందులే కొనలేకున్నావు-టానిక్కెందుకులే!"

"తల తాకట్టు పెట్టి కొనుక్కుంటాలే డాక్టరమ్మా- మరీ సన్నగా వున్నాడు."

నడుస్తున్నదల్లా ఆగి తల తిప్పింది ఉదయలక్ష్మి. పేలికలయిన చీరతో గుడ్డలుజేని నల్లటి బిడ్డను భుజానేసుకొని డాక్టరమ్మను టానిక్కు వ్రాసివ్వమని అడుగుతున్న పాతికేళ్ళ కార్మిక యువతిని చూసిందామె.

తలతాకట్టుపెట్టి ఈనాడు నీవు కొని తాగించే ఆ మందుతో పెరిగి పెద్దవాడయిన నీ బిడ్డ నీ అదృష్టమంటూ బాగుండి ముందుగా నువ్వు పోతే నీ తలకు కొరివి పెట్టడానికి పనికొస్తాడు పిచ్చితల్లీ! అనుకుని నిట్టూర్చి నీరసంగా తన పడక దగ్గరకు నడవబోయిన ఆ ముసలి తల్లి కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి, ఆనందంతో తడి అయ్యాయి, తనకే అర్ధంకాని భావ స్పందనతో ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఏడో నెంబరు పడక ప్రక్కనవున్న స్టూలుమీద తన కొడుకు, ఆమె అపురూపంగా పెంచుకున్న తన ఏకైక కొడుకు.

ఆమె అడుగుల వేగం పెరిగింది. కొన్ని యూనిట్ల అధిక శక్తి ఆమె శరీరంలో కొచ్చి చేరింది.

"చిన్నా!" ఎప్పుడొచ్చావురా.

"ఇప్పుడేమ్మా. ఆరోగ్యం ఎలా వుంది? ఏదీ.... రావాలంటే పడలేదు" ఆమె ఆనందపు జల్లులో వడగళ్ళు

"రావాలంటే పడలేదా" అన్నీ వీలుపడే వాడిని సాకిందా? వీలు చూచుకుని వాడికి కావాల్సినవి అమర్చలేదా తను!"

"అమ్మా! నీ మనవడికి బాగలేదు కట్టెపుల్లలా అయ్యాడు. వాడి తోనే సరిపోతోంది. ఏమిటో మాయ జబ్బు! అన్ని తింటూనే తగ్గిపోతు న్నాడు. పెద్ద డాక్టర్లకు చూపిద్దామంటే డబ్బులేదు. ఏమీ తోచడం లేదు."

అతను తనను సాకి తనకంట్లో నలుసు పడితే ఆమె కాల్లో గాజు పలుకు గుచ్చుకున్నంతగా తపనపడే తల్లికి బి పి ఎంతుంది? షుగర్ ఎలా వుంది? అసలిక్కడ ఎవ్వరూ లేకుండా ఎలా బ్రతుకుతోంది అని అడగలేదు. తనను రేపు నిర్లక్ష్యం చేయబోయే తన కొడుకు ఏమయి పోతాడో అని ఆరాటపడుతున్నాడు! సృష్టి ఎంత చిత్రమైంది!

తనని కొడుకు పరామర్శించకుండా తన కొడుకు గురించి చెపు తున్నాడనే యోచనే ఆ ముసలి తల్లికి రాలేదు.

అయ్యో! అనుకుంది. అలా అనుకొని ఊర్కోలేదు. ఎలాగయినా సరే తన మనవడిని బ్రతికించుకుంటే బాగుంటుందనుకుంది.

ఐదు నిముషాలు కూర్చున్న కొడుకు తను తెచ్చిన ఆరు బత్తాయి పళ్ళు స్టూల్‌మీద పెట్టి లేచి వస్తానమ్మా అన్నాడు.

కొడుకు ఇంకాస్సేపు వుంటే బాగున్నని ఆమె అనుకుంది కానీ ఆమె వుండమనలేదు పోనీ పాపం! ఆ బిడ్డకెలా వుందో అనుకుని తలూపింది.

ఆ మర్నాడు దిండు క్రిందనుండి ముప్పైఅయిదు పైసలు తీసి వార్డు బాయ్ చేతికిచ్చి ఇన్లాండు కవరు తెప్పించుకుంది. వణికే చేతుల్తో అందులో వ్రాసింది పిచ్చి తల్లి.

"చిన్నా ....

ఈ నెలాఖరుకు నాకు ఎల్.ఐ.సి. డబ్బు రావాలి. గడువు తీ
పోయింది. ఆ పదివేలు– నువ్వు తీసుకుని బాబిగాడికి ఒళ్ళు నయ
చేయించుకో! బాధపడకు వాడికి నయం అవుతుంది. వాడిని చూడాల
వుంది. ఇక్కడ నుండి డిశ్చార్జి అయ్యాక వస్తాను.

ప్రేమతో

మీ అమ్మ.

రెడ్డి జయప్రద

వాలి. గడువు తీ

ాడికి ఒప్పు నయ

వాడిని చూడాల

ప్రేమతో

మీ అమ్మ.

అని ఆరా